


# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి గురువారం 08-02-2024 సంపుటి : 06 సంచిక : 151 పేజీలు : 8 వెల : రూ 3-00




# రూ.2.86లక్షల కోట్లతో బడ్జెట్

## ప్రవేశపెట్టిన జగన్ సర్కారు..

అమరావతి ఫిబ్రవరి 07 ( విభారె) ఫ2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.2,86, 389 కోట్లతో ఏపీ ప్రభుత్వం అసెంబ్లీలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. రూ. 2,30,110 కోట్లు రెవెన్యూ వ్యయం, రూ.30,530 కోట్ల మూలధన వ్యయంగా పేర్కొంది. రూ.24,758 కోట్ల రెవెన్యూ లోటు, రూ.55,817 కోట్ల ద్రవ్యలోటు ఉన్నట్లు తెలిపింది. రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో 3.51 శాతం ద్రవ్యలోటు, జీఎస్‌డీపీలో రెవెన్యూలోటు 1.56 శాతమని ఆర్థిక బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. బడ్జెట్ ప్రసంగాన్ని మొదలుపెట్టే సమయంలో మహాత్మాగాంధీ సందేశంతో మొదలుపెట్టారు. ఐదేళ్లుగా బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశం తనకు దక్కిందన్న ఆయన.. మేనిఫెస్టోను సీఎం జగన్ పవిత్ర గ్రంథంగా భావించానన్నారు.లక్ష35వేల మంది ఉద్యోగాలతో గ్రామ సచివాలయాల ఏర్పాటు చేశామన్నారు. రెండున్నర లక్షల మంది వాలంటీర్లతో గడపగడపకూ పాలన అందుతుందన్నారు. ప్రతి విద్యార్థికి టోఫెల్ ధృవీకరణ పత్రం ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని, విద్యా ప్రమాణాల మెరుగు కోసం 9,52,927 ట్యాబ్‌లను పంపిణీ, 34.30లక్షల మంది విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంచామన్నారు. వెయ్యి స్కూళ్లలో సీబీఎస్‌ఐ సిలబస్ అమలు చేస్తున్నట్లు తెలిపారు. అంబేద్కర్, వైస్సార్ లాంటదర్శానికుల ఆలోచనతో ప్రభుత్వం పాలన కొనసాగిస్తుందన్నారు. రాష్ట్ర ష్ట్ర సమస్యల్ని పాత, మూసపద్ధతులతో కాకుండా సరికొత్త విధానాల్ని అవలంభించామన్నారు.పాలనా వికేంద్రీకరణతో పౌరసేవలను ప్రజల వద్దకు తీసుకెళ్లేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. పాలనా విభాగాలను పునర్వవస్థీకరించి అన్ని వర్గాల వారికి సాధికారత అందించామని చెప్పారు. విద్యార్థులను ప్రపంచస్థాయి పోటీకి సిద్ధం చేసేలా పాఠశాల్లలో ఇంగ్లిష్ మీడియాన్ని ప్రవేశపెట్టామన్నారు. వెయ్యి పాఠశాలల్లోని 4,39,395 మంది విద్యార్థులను సీబీఎస్ఈ పరిధిలోకి తీసుకువచ్చినట్లు వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఐబీ పాఠ్యప్రణాళిక, ప్రతీ విద్యార్థికి టోఫెల్ ధ్రువీకరణ పత్రాన్ని అందించేలా ప్రయత్నం చేస్తున్నామన్నారు.కొత్త పారిశ్రామిక విధానంతో సంపన్న ఆంధ్రా..రీసర్వే, ల్యాండ్ టైటిలింగ్ చట్టాలతో భూభద్ర ఆంధ్రాగా ఆంధ్రప్రదేశ్ మారిందని తెలిపారు. ఇప్పటి వరకూ ఎవరూ చేయని పనులు జగన్ ప్రభుత్వం చేసిందని పేర్కొన్నారు. సుపరిపాలన ఆంధ్ర, సామర్థ్య ఆంధ్ర, మహిళా మహారాణుల ఆంధ్ర, అన్నపూర్ణాంధ్ర, సంక్షేమాంధ్ర, సంపన్న ఆంధ్ర, భూభద్ర ఆంధ్రను సాధించామన్నారు. పాలనా పరమైన పునర్నిర్మాణంలో 13 కొత్త జిల్లాలు, 26 కొత్త రెవెన్యూ డివిజన్లు, పోలీస్ డివిజన్లు ఏర్పాటయ్యాయన్నారు. కొత్త రెవెన్యూ, పోలీస్ డివిజన్లను కుప్పంలోనూ ఏర్పాటు చేశామన్నారు.అందరికీ సమానంగా పాలన అందాలనే వికేంద్రీకరణకు శ్రీకారం చుట్టామన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా రూ.2356 కోట్లతో పనులు చేపట్టామన్నారు. సామర్థ్య ఆంధ్రా ద్వారా మానవ వనరులపై పెట్టుబడి పెడుతున్నామని, మానవ మూలధన అభివృద్ధికి ఐదేళ్లుగా ప్రాధాన్యతాక్రమంలో పెట్టుబడి ఐఎఫ్‌పీ ప్యానెల్స్ ట్యాబ్‌లను అందించడం ద్వారా బోధన, అభ్యాస ఫలితాలు మెరుగయ్యాయన్నారు.నాల్గో తరగతి నుంచి 12వ తరగతి వరకు 34.30లక్షల మంది విద్యార్థులు మరింత ప్రతిభావంతులయ్యారన్నారు. నాడు నేడు ద్వారా ఐదేళ్లలో 99.81శాతం పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయాలు అందించామన్నారు. మొత్తం రూ.7,163 కోట్లు ఖర్చు చేశామన్నారు. సంపూర్ణ పోషణ, గోరుముద్ద పథకాల ద్వారా పోషణా లోపాన్ని 2023 నాటికి 6.84 శాతానికి తగ్గించినట్లు తెలిపారు. విదేశీ విద్యాదీవెన ద్వారా 1,858 మంది విద్యార్థులకు ప్రఖ్యాత విశ్వవిద్యాలయాల్లో ఉన్నత విద్య అందేలా చర్యలు తీసుకున్నామని బుగ్గన వివరించారు.

# కాంగ్రెస్ కు 40 సీట్లు కూడా రావు..!

**రాజ్యసభలో ప్రధాని మోదీ చురకలు**
**కాంగ్రెస్ బానిసత్వ గుర్తుల్ని చెరిపేస్తున్నాం**
**కాశ్మీర్ వెనుకబాటు తనానికి కాంగ్రెస్ కారణం**
**రాష్ట్రాల హక్కుల్ని కాపాడతాం**
**రాజ్యసభలో దేశ ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటన**



ఢిల్లీ,: కాంగ్రెస్ పతనం తనకేమీ ఆనందం ఇవ్వదని దేశ ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. లోక్‌సభలో మొన్నీమధ్య కాంగ్రెస్‌పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తిన ప్రధాని మోదీ.. ఇవాళ రాజ్యసభలోనూ హస్తం పార్టీపై సెటైర్లు వేశారు. రాజ్యసభలో.. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చకు ప్రధాని మోదీ సమాధానం ఇస్తున్నారు."రాష్ట్రపతి ప్రసంగంపై జరిగిన చర్చలో సభ్యులు కొందరు తమ అభిప్రాయాలు చెప్పారు. మరికొందరు విమర్శలు గుప్పించారు. లోక్‌సభలో ఖర్గేను చాలా మిస్ అయ్యాను, రాజ్యసభలో కలవడం ఆనందంగా ఉంది. ఖర్గే చాలా శ్రద్ధగా వింటున్నారు. ఖర్గే స్వేచ్ఛగా మాట్లాడారు. ఆయనకు అంతటి స్వేచ్ఛ ఎలాగ వచ్చిందని నాకు ఆశ్చర్యమేసింది. బహుశా ఆ రోజు వారి స్పెషల్ కమాండర్లు ఇద్దరు (కేసీ వేణుగోపాల్, జైరాం రమేశ్‌ను ఉద్దేశిస్తూ) ఆ రోజు సభకు రాలేదేమో! అంటూ ప్రధాని మోదీ చురకలు అంటించారు.?మాకు 400 సీట్లు రావాలని ఖర్గే ఆశీర్వదించారు.కానీ, కాంగ్రెస్‌కు 40 సీట్లు కూడా రావు. ఈ విషయాన్ని వాళ్ల మిత్రపక్షంలోని నేత మమతా బెనర్జీనే చెప్పారు. చూస్తుండగానే కాంగ్రెస్ పరిస్థితి దిగజారిపోయింది. కాంగ్రెస్ పతనం నాకేమీ ఆనందం ఇవ్వదు. కాంగ్రెస్ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసింది. ఆలోచనల్లోనూ కాంగ్రెస్ ఔట్‌డేటెడ్ అయ్యింది. కాంగ్రెస్ పత్రికా స్వేచ్ఛను కాలరాసింది. అంబేద్కర్‌కు భారతరత్న ఇవ్వాలని ఏనాడూ కాంగ్రెస్ అనుకోలేదు. కానీ, వాళ్ల కుటుంబ సభ్యులకు మాత్రం భారతరత్న ఇచ్చుకున్నారు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాల్ని రాత్రికి రాత్రి కూల్చేసింది. దేశాన్ని విభజించే కుట్ర ఇప్పుడు మరోసారి కాంగ్రెస్ చేస్తోంది. ఈ క్రమంలోనే దక్షిణ, ఉత్తరం అంటూ దేశాన్ని రెండు ముక్కలు చేసే యత్నం చేస్తోంది.

# బడ్జెట్‌కు కేబినేట్ ఆమోదం

## డోన్‌లో హార్టికల్చరల్ ఫుడ్ ప్రాసెసింగ్ పాలిటెక్నిక్ కాలేజ్

## పలు ఇతర అంశాలకు ఆమోదం

అమరావతి,ఫిబ్రవరి7( సచివాలయంలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం ఉదయం సమావేశమైన రాష్ట్ర కేబినెట్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ఆమోదించడంతో పాటు పలు ఇతర నిర్ణయాలు తీసుకుంది. నంద్యాల జిల్లా డోన్‌లో కొత్తగా హార్టికల్చరల్ ఫుడ్ ప్రాసెసింగ్ పాలిటెక్నిక్ కాలేజ్ ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. డాక్టర్ వైఎస్ఆర్ హార్టికల్చర్ యూనివర్సిటీ ఈ హార్టీకల్చరల్ పాలిటెక్నికల్ కళాశాల పనిచేయనుంది.దీంతో పాటు డోన్‌లో వ్యవసాయం రంగంలో రెండేళ్ల డిప్లొమా కోర్సుతో వ్యవసాయ పాలిటెక్నిక్ కాలేజీ ఏర్పాటుకు కూడా కేబినెట్ ఆమోదం తెలిపింది. ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చర్ యూనివర్సిటీ పరిధిలో ఈ కాలేజీ పనిచేయనుంది. ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ యూనివర్సిటీస్ (ఎస్టాబ్లిస్‌మెంట్ అండ్ రెగ్యులేషన్) యాక్ట్ 2016కు సవరణలు చేయడం ద్వారా బ్రౌన్‌ఫీల్డ్ కేటగిరిలో మూడు ప్రైవేట్ యూనివర్శిటీలకు కేబినెట్ అనుమతిచ్చింది. అన్నమయ్య జిల్లా రాజంపేటలో అన్నమాచార్య యూనివర్శిటీ, తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో గోదావరి గ్లోబల్ యూనివర్శిటీ, కాకినాడ జిల్లా సూరంపాలెంలో ఆదిత్య యూనివర్శిటీల ఏర్పాటుకు కేబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. వీటితో పాటు గవర్నర్ ప్రసంగానికి కేబినెట్ ఆమోదం తెలిపింది.

# ఎన్నికల సమర్థ నిర్వహణకు ప్రణాళికలు రూపొందించుకోండి

## నోడల్ అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ డా. కె.శ్రీనివాసులు



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 07 రానున్న సార్వత్రిక ఎన్నికల సమర్థ నిర్వహణకు పటిష్ట ప్రణాళికలు రూపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ డా. కె.శ్రీనివాసులు 16 కమిటీల నోడల్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన ఛాంబర్ లో ఎన్నికల సంసిద్ధతపై నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. కె.శ్రీనివాసులు మాట్లాడుతూ రాబోయే సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు ఇప్పటినుంచే పటిష్ట ప్రణాళికలు రూపొందించుకోవాలని నోడల్ అధికారులను ఆదేశించారు. భారత ఎన్నికల సంఘం సూచించిన మార్గదర్శకాలను, హ్యాండ్ బుక్కులను నోడల్ అధికారులు క్షుణ్ణంగా చదివి ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా ఎన్నికల విధులను అత్యంత అప్రమత్తంగా నిర్వహించాలన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులను రాండమైజేషన్ పద్ధతిలో కేటాయించేందుకు అవసరమైన సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలని మ్యాన్ పవర్ కమిటీ నోడల్ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బందికి సంపూర్ణ అవగాహన కల్పించే రీతిలో శిక్షణ కార్యక్రమాలు ఇవ్వాలని ట్రైనింగ్ మేనేజ్మెంట్ కమిటీ నోడల్ అధికారిని సూచించారు. ఎన్నికల సంఘం నుంచి వచ్చిన పోలింగ్ మెటీరియల్ ను సరిచూసుకొని లోటుపాట్లపై నివేదికను తయారు చేసుకుని సిద్ధంగా ఉంచుకోవాలని మెటీరియల్ మేనేజ్మెంట్ నోడల్ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలకు తరలించే మెటీరియల్ పోలింగ్ సిబ్బందికి అవసరమయ్యే వాహనాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ట్రాన్స్పోర్ట్ మేనేజ్మెంట్ నోడల్ అధికారిని సూచించారు. యువ ఓటర్ల నమోదుకు సంబంధించి అన్ని కళాశాలలు విద్యాసంస్థల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి కొత్త ఓటర్ల నమోదుకు చర్యలు తీసుకోవాలని స్వీప్ మేనేజ్మెంట్ నోడల్ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల పరిశీలన, భద్రత, ట్రాన్స్పోర్ట్, సీలింగ్ తదితర అంశాలపై జాగ్రత్తలు తీసుకోవాలని ఈవీఎం మేనేజ్మెంట్ నోడల్ అధికారిని సూచించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి, ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఖర్చు వివరాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పర్యవేక్షించాలని యంసిసి, ఎక్స్పెండిచర్ మానిటరింగ్ కమిటీ నోడల్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కమ్యూనికేషన్ ప్లాన్, ఎలక్ట్రోరల్ రోల్ పై ఎప్పటికప్పుడు చర్యలు చర్యలు తీసుకోవాలని సంబంధిత కమిటీ నోడల్ అధికారులను సూచించారు.లా అండ్ ఆర్డర్, బ్యాలెట్, పోస్టల్ బ్యాలెట్, మీడియా మేనేజ్మెంట్, కంప్లైంట్ రెడ్రస్సల్ కమిటీలకు కేటాయించిన పనులు బాధ్యతాయుతంగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు.అనంతరం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కామేశ్వరరావు అన్ని రకాల కమిటీలు చేయాల్సిన పనులు, చేయకూడని పనులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణనిచ్చారు.

# మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల

**మొత్తం 6,100 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ**
**12వ తేదీ నుంచి పక్రియ ప్రారంభం**
**12వ నుంచి 22వ తేదీ మధ్య దరఖాస్తుల స్వీకరణ**
**24వ తేదీన ఆన్‌లైన్ మాక్ టెస్ట్**
**వివరాలు వెల్లడించిన మంత్రి బొత్స**



విజయవాడ,ఫిబ్రవరి7: ఆంధ్రప్రదేశ్‌లో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల అయ్యింది. మొత్తం 6,100 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్‌ను బుధవారం మధ్యాహ్నం విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ సచివాలయం నుంచి విడుదల చేశారు. ఈ నెల 12వ తేదీ నుంచి పక్రియ ప్రారంభం అవుతుందని.. ఏప్రిల్ 7వ తేదీన ఫలితాలు ప్రకటిస్తామని తెలిపారు. ఏపీ డీఎస్సీ నోటిఫికేషన్ వివరాల్ని మంత్రి బొత్స మీడియాకు వివరించారు. రాష్ట్రంలో 2024 డీఎస్సీని ప్రకటిస్తున్నాం. ఏడు మేనేజ్ మెంట్ల పరిధిలో 6100 పోస్టులతో డీఎస్సీని ప్రకటిస్తున్నాం. మెగా డీఎస్సీలో.. మొత్తం పోస్టుల్లో 2,299 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు, 2,280 ఎస్‌జీటీ పోస్టులు, 1,264 టీజీటీ పోస్టులు, 215 పీజీటీ పోస్టులు ఉన్నాయి. ఈ నెల 12వ తేదీ నుంచి డీఎస్సీ పక్రియ ప్రారంభం అవుతుంది. ఏప్రిల్ 7వ తేదీతో ముగుస్తుంది. విద్య మా ప్రభుత్వ మొదటి ప్రాధాన్యత. మా ప్రభుత్వం ఈ అయిదేళ్లలో రూ.73 వేల కోట్లు విద్య పై ఖర్చు చేసిందని మీడియాకు మంత్రి బొత్స తెలిపారు. నెల 12వ తేదీ నోటిఫికేషన్ రిలీజ్‌తో డీఎస్సీ పక్రియ ప్రారంభం అవుతుంది. ఆన్‌లైన్‌లో 12వ తేదీ నుంచి 22వ తేదీ మధ్య దరఖాస్తుల స్వీకరణ ఉంటుంది. 24వ తేదీన ఆన్‌లైన్ మాక్ టెస్ట్ రాసేందుకు అభ్యర్థులకు వీలు కల్పిస్తారు. మార్చి 5వ తేదీ నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. మార్చి 15వ తేదీ నుంచి 30వ తేదీ వరకు రెండు సెషన్స్‌లో డీఎస్సీ పరీక్షలు ఉంటాయి. మార్చి 31వ తేదీన ప్రాథమిక కీ విడుదల అవుతుందని.. ఏప్రిల్ 1వ తేదీన కీలో అభ్యంతరాలపై స్వీకరణ ఉంటుందని.. ఆ వెంటనే ఏప్రిల్ 2వ తేదీన ఫైనల్ కీ విడుదల చేస్తామని చెప్పారు. ఏప్రిల్ 7వ తేదీన డీఎస్సీ ఫలితాలు వెల్లడిస్తామని తెలిపారు. మొత్తం ఖాళీల్లో ఎస్జీజీ-2280 పోస్టులు, స్కూల్ అసిస్టెంట్-2299 పోస్టులు, టీజీటీ-1264 పోస్టులు, పీజీటీ-215 పోస్టులు, ప్రిన్సిపల్-42 పోస్టులు ఉన్నాయి. ఈసారి కొత్తగా 12ఏళ్ల క్రితం తొలగించిన అప్రెంటిస్‌షిప్ విధానాన్ని తీసుకురానున్నారు. రాత పరీక్షలో ఎంపికైన టీచర్లకు రెండేళ్లపాటు గౌరవవేతనానికి విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. రెండేళ్ల తర్వాత పూర్తిస్థాయి స్కేల్ వస్తుంది. కంప్యూటర్ ఆధారిత విధానంలో టెట్, డీఎస్సీ పరీక్ష నిర్వహించనున్నారు. అప్రెంటిస్‌షిప్ సమయంలో ఎవరైనా ఏపీ ఉద్యోగుల నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారని ప్రభుత్వం భావిస్తే వారి అప్రెంటిస్‌షిప్ సమయాన్ని పెంచే అవకాశం ఉంటుంది.ఈ పరీక్షల నిర్వహణకు సంబంధించి పాఠశాల విద్యాశాఖ టీసీఎస్‌తో ఒప్పందం కుదుర్చుకోనుంది. సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులకు పేపర్-1, స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు పేపర్-2 విడివిడిగా టెట్ నిర్వహిస్తారు. ఎస్జీటీ పోస్టులకు డీఈడీ లేదా నాలుగేళ్ల బ్యాచిలర్ ఆఫ్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ చదివిన వారు మాత్రమే అర్హులు. టెట్ రాసేందుకు ఓసీలకు ఇంటర్మీడియట్‌లో 50 శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులైన అభ్యర్థులకు డిగ్రీలో అర్హత మార్కులు 40 శాతంగా ప్రభుత్వం నిర్ణయించింది. అయితే దీన్ని ఒక్కసారికే అనుమతించింది.

# సంపాదకీయం

గురువారం 08-02-2024

## గత పాలకుల పాపాలను ఎండగట్టాల్సిందే !

వేసవి ప్రారంభానికి సూచికగా శివరాత్రికి ముందే సూరీడు మెల్లగా వేడెక్కుతున్నాడు. ఎండలు బాబోయ్ అనేలా సూర్యగమనం మొదలయ్యింది. ఇక ఈయేడు కూడా ఎండలు మండించనున్నాయి. ఇదే క్రమంలో ఎన్నికల వేడి కూడా అంటుకుంటోంది. ఏప్రిల్‌లో ఎండలు సుర్రుమనేనాటికి ఎన్నికల వేడి కూడా తారా స్థాయికి చేరుకునే అవకాశం ఉంది. తాజాగా తెలంగాణలో ఈ వేడి మరింత రాజుకునే అవకాశం ఉంది. ఓ వైపు పార్లమెంట్ ఎన్నికలకు ముందే తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఓటాన్ అకౌంట్ బడ్జెట్ అయినప్పటికీ, ఇప్పటికే శ్వేతపత్రాలతో గత కెసిఆర్ ప్రభుత్వ అవినీతి, అక్రమాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఎండగట్టింది. ఇప్పుడు మరోమారు కాళేశ్వరం సహా అనేక ప్రాజెక్టుల్లో అవినీతి, ధరణి వంటి సమస్యలను ప్రస్తావించడం ద్వారా బిఆర్‌ఎస్‌ను ఎండగట్టడానికి సిద్ధం అవుతోంది. ఈ క్రమంలో కృష్ణాప్రాజెక్టులను కేంద్రానికి అప్పగించడంపై ఎదురుదాడికి బిఆర్‌ఎస సిద్ధం అవుతోంది. దీంతో ఈ సమావేశాలు వాడీవేడీగా సాగనున్నాయి. కెసిఆర్ అసెంబ్లీకి హాజరవుతారని అంటున్నారు. విపక్షం రేవంత్‌ను రెచ్చగొట్టి ట్రాప్‌లో పడేయాలని చూస్తుంది. అలాంటి ట్రాప్‌లో పడకుండా రేవంత్ రెడ్డి హుందాగా ఉండాలి. ఎందుకంటే రెచ్చగొట్టి రెచ్చిపోయేలా మాట్లాడించేలా చేస్తారని గుర్తించాలి. అయితే ఎన్నికల సమయంలో ఎలాంటి భాష వాడినా, ఎలాంటి విమర్శలు చేసినా చెల్లుతుంది. అధికారంలోకి వచ్చినందున సిఎం రేవంత్ రెడ్డి భాష విషయంలో సంయమనం పాటించాల్సిందే. హుందాగా ఉండాల్సిందే. మాటలను కూడా పరుషంగా వాడినా..అందులో అసభ్యత లేకుండా చూసుకోవాలి. రేవంత్ రెడ్డి రెండు నెలల పాటు సంయమనంగా ఉండగలిగారు. కానీ ఇప్పుడు ఆయన కొద్దగా మాటలతో కట్టు తప్పుతున్నారు. దారుణమైన భాషతో కేసీఆర్ పై ,బీఆర్ఎస్ పై విరుచుకపడుతున్నారు. ఆ భాష గతంలో కేసీఆర్ వాడిందేనని సమర్థించుకుంటున్నారు. రాజకీయాలు హుందాగా ఉండాలి. గత ప్రభుత్వంలో జరిగిన తప్పులను ప్రజల ముందుంచాలి. తప్పు ఎవరిది ఒప్పు ఎవరిది అనేది.. నిజాలన్నీ ప్రజల ముందు పెడితే అర్థం చేసుకుంటారు. అందుకు అసెంబ్లీని వేదికగా చేసుకోవాలి. ఇంద్రవెల్లిలో నిర్వహించిన తెలంగాణ పునర్ నిర్మాణ సభలోనూ రేవంత్ రెడ్డి మాటలు తూలారు. ప్రభుత్వాన్ని పడగొడతామని మాట్లాడున్నారని వారిని పండబెట్టి తొక్కుతామని కట్టేసికొడతామని హెచ్చరికలు జారీ చేశారు. అయితే రెచ్చగొట్టేందుకు బిఆర్‌ఎస్ సిద్దంగా ఉంది. వారి ట్రాప్‌లో పడి రెచ్చిపోకుండా చూసుకోవాల్సిన బాధ్యత సిఎంగా రేంవత్ రెడ్డిపై ఉంది. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షం అనేది ఎప్పుడూ ప్రభుత్వాలను ఇరుకున పెట్టడానికే ప్రయత్నిస్తుంది. కెసిఆర్ అధికారంలో ఉండగా ప్రతిపక్షాలకు మాట్లాడనిచ్చే అవకాశం ఇవ్వలేదు. అసెంబ్లీలో ఏది మాట్లాడినా మైక్ ఇవ్వలేదు. ఇప్పుడు స్వేచ్ఛ ఇచ్చారు గనక బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు చాన్స్ వస్తే వదులుకోరని అందరికీ తెలుసు. తన ప్రభుత్వాన్ని కాపాడుకోవాల్సిన పని సీఎం మీదనే ఉంటుంది. కానీ మాటలు జారడం వల్ల ప్రతిపక్షానికి దొరికిపోతారు. విలువల పతనం కొనసాగుతుందన్న ఆందోళన ప్రజాస్వామ్య వాదుల్లో వినిపిస్తోంది. ముఖ్యమంత్రి స్థానానికి ఓ గౌరవం ఉంటుంది. దాన్ని కాపాడాల్సిన బాధ్యత.. ఆ సీటులో కూర్చున్న వారికే ఉంటుంది. నాడు కేసీఆర్ అలా చేశారని ఈ రోజు రేవంత్ రెడ్డి అంతకు మించి చేస్తే..రేపు వచ్చే వాళ్లు మరింత దిగజారుస్తారు. అప్పుడు పోయేది ఆయా వ్యక్తుల పరువు కాదు.. సీఎం హోదా పరువని గుర్తించుకోవాలి. ఇకపోతే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చినప్పుడు కక్ష సాధింపులకు పాల్పడతారని అందరూ అనుకున్నారు. కానీ ఆయన అలాంటి కక్ష సాధింపులకు ఇంకా పాల్పడలేదు. అలాంటివేమీ ఉండవని ఆయన చెప్పారు. రెండు నెలలపాటు అలాగే పరిపాలనచేశారు. ఎందుకంటే కాంగ్రెస్‌లో గ్రూపు రాజకీయాలు ఎక్కువ. తెలంగాణలో కూడా అదే పరిస్థితి. కానీ రేవంత్ చాలా సున్నితంగా వ్యవహారాలను చక్కదిద్దుకుంటూ వెళున్నారు. ఐఎఎస్,ఐపిఎస్, దిగువ స్థాయి పోలీసు అధికారుల పోస్టింగ్‌లు, పదోన్నతులు, భూముల వివాదాలు వంటి విషయంలో ఎక్కడా పార్టీ నేతల్ని కూడా నొప్పించకుండా.. అలాగని పైరవీలకు తలొగ్గకుండా పని చేసుకుంటూ పోతున్నారు. విధాన పరమైన నిర్ణయాల విషయాల్లో కూడా ఆయన తొందరపాటు ప్రదర్శించడం లేదు. పరిస్థితుల్ని అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ఉద్యోగులకు ఒకటో తేదీ జీతాలిస్తున్నారు. నిధుల అందుబాటును బట్టి రైతుబంధు నిధులు రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నారు. నామినేటెడ్ పదవుల విషయంలోనూ లౌక్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయాలను గవర్నర్ తమిళిసై అంగీకరించేలా చేయడంలో ఆయన అంతులేని లౌక్యాన్ని ప్రదర్శించారని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. గతంలో తమిళిసై ప్రభుత్వ ప్రతిపాదనలు అనేకం పెండింగ్‌లో పెట్టారు. ఎంఎల్‌సిలుగా ప్రొ.కోదం డరాం, అమీర్ అలీఖాన్ ఎంపిక సులభమయ్యేలా సఫలీకృతమయ్యారు. తర్వాత కోర్టు స్టేటస్ కో విధించింది. అది వేరే విషయం. కేంద్రంతో కూడా ఘర్షణ పూరిత వైఖరి కాకుండా సయోధ్యతో వ్యవహరిస్తూ మెహదీపట్నంలో ప్రధాన సమస్యగా ఉన్న స్కైవాక్ నిర్మాణానికి ప్రధాన ఆటంకంగా ఉన్న రక్షణ శాఖ భూములను అప్పగించేలా చేయడంలో విజయ వంతమయ్యారు. మెట్రో రెండో దశ విస్తరణ లోనూ ఆయన రియల్ ఎస్టేట్ ప్రయోజనాలకు పెద్దపీట వేయలేదు. లోక్‌సభ ఎన్నికలు జరిగే ఏప్రిల్‌లోపు, ఎన్నికల కోడ్ వచ్చేలోపు మరికొన్ని హామీలు అమలు చేయడం ద్వారా ప్రజల విశ్వాసం పెంచుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

# అమెరికాలో మరో భారత సంతతి విద్యార్థి అనుమానాస్పద మృతి..

### నెల రోజుల్లో ఐదో ఘటన! ఏం జరుగుతోందక్కడ..?

అగ్రరాజ్యం అమెరికాలో మరో భారత సంతతి విద్యార్థి మృతి చెందాడు. గత నెల రోజులుగా అక్కడ చదువుకుంటున్న భారత సంతతి విద్యార్థులు వరుసగా ప్రాణాలు కోల్పోతుండటం కలకలం రేపుతోంది.తాజాగా మరో ఘటన చోటుచేసుకోవడంతో చర్చణీయాంశంగా మారింది. అమెరికాలోని ఇండియానా రాష్ట్రంలోని పర్డ్యూ




విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ చదువుతున్న సమీర్ కామత్ (23) అనే భారత సంతతి విద్యార్థి అనుమానాస్పద రీతిలో మృతి చెందాడు. విలియమ్స్‌పోర్ట్‌లోని 3300 నార్త్ వారెన్ కౌంటీ రోడ్ 50 వెస్ట్‌లోని క్రోస్ గ్రోవ్ నేచర్ ప్రిజర్వ్ వద్ద సోమవారం సాయంత్రం అతని మృతదేహం లభ్యమైనట్లు అధికారులు వెల్లడించారు.సమీర్‌కు అమెరికా పౌరసత్వం ఉంది. గతేడాది ఆగస్టులో అతను మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేశాడు. ఈ ఏడాది పర్డ్యూ యూనివర్సిటీలోని మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో డాక్టరల్ డిగ్రీని అభ్యసిస్తున్నాడు. అతడి మృతికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. మంగళవారం సమీర్ మృతదేహానికి పోస్ట్‌మార్టం నిర్వహించారు. ఫోరెన్సిక్ పోస్టుమార్టం రిపోర్ట్ వచ్చిన తర్వాతే దీనిపై స్పష్టత వస్తుందని అధికారులు తెలిపారు. ఈ ఏడాది జనవరి నుంచి భారత సంతతికి చెందిన విద్యార్థులు వరుసగా ప్రాణాలు కోల్పోతున్నారు. సమీర్‌తో కలిపి ఈ ఏడాదిలో మొత్తం ఐదుగురు ఐదో ఘటన కావడం గమనార్హం.కాగా.. పర్డ్యూ యూనివర్సిటీలో చదువుతున్న మరో భారత సంతతి విద్యార్థి నీల్ ఆచార్య కూడా ఇటీవల ఇదే విధంగా అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. కంప్యూటర్ సైన్స్ మరియు డేటా సైన్స్ చదువుతున్న నీల్ ఆచార్య కొన్ని గంటల పాటు కనిపించకుండా పోయాడు. ఆ తర్వాత అదే క్యాంపస్‌లో శవమై కనిపించాడు. దీంతో పోలీసులు అతని మృతదేహం స్వాధీనం చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. గతవారం ఒహియోలో భారత-అమెరికన్ విద్యార్థి శ్రేయాస్‌రెడ్డి బెనిగేరి మరణించాడు. సిన్సినాటిలోని లిండ్నర్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో విద్యార్థిగా ఉన్నాడు. అలాగే జనవరి 16న అమెరికాలోని జార్జియా రాష్ట్రంలోని లిథోనియాలో 25 ఏళ్ల భారతీయ విద్యార్థి వివేక్ సైనీ ఓ వ్యక్తి చేతిలో దారుణంగా హత్యకు గురయ్యాడు. జనవరి 20న అకుల్ ధావన్ అనే 18 ఏళ్ల భారతీయ-అమెరికన్ విద్యార్థి ఇల్లినాయిస్ విశ్వవిద్యాలయం సమీపంలోని భవనం వెనుక వరండాలో శవమై కనిపించాడు.

# ఇంటికి తాళంవేసి పొలానికి వెళ్లారు.. కట్‌చేస్తే.. తిరిగొచ్చి చూడగా..

వికారాబాద్ జిల్లా పరిగి మండలం సోండేపూర్ గిరిజన తాండాలో పట్ట పగలే ఓ ఇంట్లో చోరీ జరిగింది. పక్కా స్కెచ్‌తో ఓ ఇంటి ప్రహరీ గోడ దూకి చోరీకి తెగబడ్డారు గుర్తు తెలియని దొంగలు.తాండాకు చెందిన హర్యానాయక్, అతని భార్య ఇంటికి తాళం వేసి పొలానికి వెళ్ళారు. అదే అదునుగా భావించిన ఇద్దరు దొంగలు స్కూటిపై వచ్చి



హర్య నాయక్ ఇంటి వద్ద రెక్కీ చేశారు. ఎవరు లేరని నిర్దారించుకున్నారు. ఒకడు గోడ దూకి ఇంట్లోకి వెళ్ళి దొంగతనం చేస్తుండగా.. మరొకడు బండిపై అటూ ఇటూ తిరుగుతూ జనాల రాకపోకలను గమనిస్తున్నాడు.ఏదో పని మీద అప్పుడే హిర్య నాయక్ పొలం నుంచి ఇంటికి వస్తుండగా.. కాంపౌండ్ వాల్ దూకి ఓ వ్యక్తి పారిపోతుండడం గమనించాడు. దీంతో ఎవరని ప్రశ్నించాడు. మీ ఇంటికి నంబర్ వేయడానికి వచ్చాను అని చెప్పి అక్కడి నుంచి హడావుడిగా బండిపై వెళ్ళిపోయారు. హిర్య నాయక్ గేటు తాళం తీసి లోపలికి వెళ్లి చూడగా లోపల తాళం విరగొట్టి ఉండడం చూసి చోరీ జరిగిందని భావించి స్థానికుల దృష్టికి తీసుకెళ్లాడు.బీరువా తెరిచి చూసి షాకయ్యాడు. బీరువాలో ఉన్న బంగారం, వెండి నగలు కనిపించలేదని వాపోయాడు. నాలుగు తులాల బంగారం, 45 తులాల వెండి దొంగతనం అయినట్లు తెలిపారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. చేతిలో రాడ్డుతో కాంపౌండ్ వాల్ దూకి ఇంట్లో వెళ్తున్న దృశ్యాలు సీసీ కెమెరాలు రికార్డు అయ్యాయి. సీసీ ఫుటేజ్ ఆధారంగా పోలీసులు విచారణ చేపడుతున్నారు.

# మెట్రోలో ప్రయాణించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము..

ఢిల్లీ, ఫిబ్రవరి 7: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బుధవారం (ఫిబ్రవరి 7) ఢిల్లీ మెట్రోలో ప్రయాణించారు. దీనికి సంబంధించిన వీడియో ఒకటి ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది.ఈ వీడియో క్లిప్‌లో రాష్ట్రపతి ముర్ము మెట్రోలో ప్రయాణిస్తూ కనిపించారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వేగంగా వైరల్ అవుతోంది.ఈ వీడియోలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పసుపు రంగు చీర, మస్టర్డ్ కలర్ స్వెటర్ ధరించి కనిపించారు. రాష్ట్రపతి ముర్ము మెట్రో రైల్లోని సీటుపై కూర్చుని అధికారులతో నవ్వుతూ మాట్లాడటం కనిపిస్తుంది. ముర్ము ముందు సీట్లో మరో వ్యక్తి కూర్చుని ఆమె ఫోటో తీయడం కూడా వీడియోలో కనిపిస్తుంది. ప్రెసిడెంట్ ద్రౌపది ముర్ము తన సెక్యూరిటీ గార్డులతో కలిసి ఈ వీడియోలో కనిపించారు. ముర్ము చుట్టూ పెద్ద సంఖ్యలో భద్రతా అధికారులు, ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ అధికారులు, ఉద్యోగులు నిలబడి ఉన్నారు. మెట్రో నిర్వహణ, కార్యకలాపాల గురించి డీఎంఆర్‌సీ ఉన్నతాధికారులు రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు వివరిస్తున్నట్లు వీడియోలో కనిపిస్తుంది. అలాగే ఆమె మెట్రో అధికారులను కూడా ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. ఢిల్లీ ప్రజల రోజువారీ అనుభవాలను తెలుసుకునేందుకు రాష్ట్రపతి ముర్ము ఈ మేరకు మెట్రోలో ప్రయాణించారు.రాష్ట్రనతి ద్రౌపది ముర్ము ఢిల్లీ మెట్రోలో ప్రయాణించే ముందు భారీ భద్రత మధ్య సెంట్రల్ సెక్రటేరియట్ మెట్రో స్టేషన్‌కు చేరుకున్నారు. అనంతరం డీఎంఆర్‌సీ అధికారుల నుంచి మెట్రో నిర్వహణపై సమాచారం తెలుసుకుని, సెంట్రల్ సెక్రటేరియట్ స్టేషన్‌లోనే మెట్రో ఎక్కి ప్రయాణించారు. మెట్రో లైన్లు, వాటి కార్యకలాపాల గురించిన పూర్తి సమాచారాన్ని మ్యాప్‌ల ద్వారా రాష్ట్రపతికి డీఎంఆర్‌సీ అధికారులు అందించారు. రాజధానిలోని ఏయే ప్రాంతాల్లో మెట్రో కార్యకలాపాలు ఏయే లైన్లలో కొనసాగుతున్నాయో తెలియజేశారు. అంతేకాకుండా రాబోయే కాలంలో ఎక్కడెక్కడ మెట్రో విస్తరణ జరుగుతుందనే విషయాలు కూడా అధికారులు వివరించారు.



## కమిషనర్ ను కలిసిన టిడిపి పార్టీ కౌన్సిలర్లు



---విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 07- నూతన మున్సిపల్ కమిషనర్ బాధ్యతలు స్వీకరించిన నిరంజన్ రెడ్డి ని బుధవారం టిడిపి మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మాబువలి. కౌన్సిలర్లు దూదేకుల జైనబి. నాగార్జున. మర్యాద పూర్వకంగా కలిశారు. మున్సిపల్ కార్యాలయం కమిషనర్ నిరంజన్ రెడ్డి కి పూల బొక్కే ఇచ్చారు .

## వివాహ వేడుకలకు హాజరైన భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి



ఆళ్లగడ్డ ప్రతినిధి ఫిబ్రవరి 08 విభారె న్యూస్ :- మండలంలోని కోటకుందుకూరు గ్రామంలో బుధవారం జరిగిన ఒక వివాహ కార్యక్రమంలో తాలూకా టిడిపి యువ నాయకులు భూమా జగద్విఖ్యాత్ రెడ్డి హాజరయ్యారు. సున్నే సాబు గారి మా భాష కుమారుడు అక్రమ్ భాష వివాహానికి ఆయన హాజరై నూతన వరుడిని ఆశీర్వదించారు. ఆయనతోపాటు మాజీ జెడ్పిటిసి చాంద్బాషా ,నన్నే భాయ్ గారి జిలాని తదితరులు పాల్గొన్నారు.

## మరీ ఇలా ఉన్నారేంట్రా బాబు..!

### ట్యాంకర్ బోల్తాపడి వాళ్లేడుస్తుంటే.. బిందేలు, బక్కెట్లతో పరిగెత్తిన ఊరోళు



హైదరాబాద్ ,రోడ్డు ప్రమాదాల ఘటనలు వరుసగా చోటుచేసుకుంటున్నాయి. ప్రమాదం ఎప్పుడు, ఎక్కడ, ఎలా జరుగుతుందో చెప్పలేం. ఇలాంటి ప్రమాదాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి.అలాంటి ఘటనే ఒకటి వెలుగులోకి వచ్చింది. అయితే ఈ సారి జరిగిన ప్రమాదంలో ప్రజలు, పాపం అనాల్సిందిపోయి ఏం చేశారో చూస్తే మీ తలను మీరే బాదుకుంటారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పెట్రోలు, డీజిల్ ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. పెరిగిన ఇంధన ధరలతో సామాన్యుల వెన్ను విరుగుతోంది. ఇదిలా ఉంటే, లక్నోలో ఇండియన్ ఆయిల్ ట్యాంకర్ ప్రమాదానికి సంబంధించిన వీడియో వైరల్ అవుతోంది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు కానీ ప్రమాదం జరిగిన తర్వాత ప్రజలు ఏం చేశారనేది షాకింగ్. ఈ ప్రమాదం గురించి సమాచారం అందిన వెంటనే ఇండ్ల నుంచి బకెట్లు, డబ్బాలతో ట్యాంకర్ వద్దకు చేరుకున్నారు. ఆ తర్వాత ఏం చేశారో వీడియోలో చూస్తే అవాక్కవ్వాల్సిందే..వీడియోలో మీరు చూడగలిగినట్లుగా, ట్యాంక్ చుట్టూ జనం పెద్ద సంఖ్యలో గుమిగూడారు. ట్యాంకర్ నుంచి పెట్రోల్, డీజిల్ లీక్ అవుతోంది. ఈ విషయం తెలియగానే ప్రజలు బిందేలు, బక్కెట్లు తెచ్చి నింపుకోవడం ప్రారంభించారు. కొందరి చేతిలో బాటిల్, మరికొందరు బకెట్ తెచ్చుకున్నారు. ఇంట్లో ఏది పడితే అది అది తెచ్చుకుని ఆయిల్ దోచుకునేందుకు అక్కడికి చేరుకున్నారు. ఒక్కసారిగా గ్రామస్తులు పెద్ద సంఖ్యలో రావటంతో తోపులాటకు దిగారు. లక్నోలో ఇండియన్ ఆయిల్ ట్యాంకర్ ప్రమాదానికి సంబంధించిన వీడియో వైరల్ అవుతోంది.

## తెల్లారి మద్యం షాప్ ఓపెన్ చేయగా.. ఎదురుగా కనిపించిన దృశ్యానికి గుండె గుభేల్..

మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట సమీపంలోని వైన్ షాపులో చోరి జరిగింది. సీసీ కెమెరాలను ధ్వంసం చేసి దుండగులు మద్యాన్ని ఎత్తుకెళ్లారు. అదే విధంగా సీసీ ఫుటేజీ నిక్షిప్తమయ్యే డీవీఆర్ బాక్స్‌ను సైతం దొంగలు పట్టుకెళ్లారు.ఈ ఘటన సోమవారం అర్ధరాత్రి జరిగింది. మూసాపేట వైన్ షాపును సంకలమద్ది శివారులో వేముల రోడ్డు పక్కన ఏర్పాటు చేశారు. ఎప్పటిలాగే రాత్రి వైన్ షాపును మూసి నిర్వాహకులు ఇంటికి వెళ్లిపోయారు. అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు షాపు పక్కన ఉన్న షట్టర్‌ను విరగొట్టి లోపలికి వెళ్లారు. అందులో ఉన్న మద్యాన్ని తీసుకెళ్లారు. అయితే దొంగలు పోతూ.. పోతూ.. సీసీ ఫుటేజ్ నిక్షిప్తమయ్యే డీవీఆర్ బాక్సును సైతం ఎత్తుకెళ్లారు.ఉదయం షాపు తెరవడానికి వచ్చిన నిర్వాహకులు షాక్ గురయ్యారు. షాపులో దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందజేశారు. నిర్వాహకుల ఫిర్యాదుతో పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని దర్యాప్తు ప్రారంభించారు. మహబూబ్‌నగర్ నుంచి వచ్చిన క్లూస్ టీం బృందం ఆధారాలను సేకరించింది. వైన్ షాపులో సుమారు రూ.5.20 లక్షల మద్యాన్ని దొంగలు ఎత్తుకెళ్లినట్టు గుర్తించారు. తెచ్చిన గంటల వ్యవధిలోనే మద్యం స్టాక్‌ను దొంగలు మాయం చేయడంతో నిర్వహకులు లబోదిబోమంటున్నారు.మద్యం చోరి జరిగిన తీరుపై పలు అనుమానాలకు తావిస్తోంది. డిస్టిలరీ నుంచి సోమవారం రాత్రే వైన్ షాపునకు మద్యం స్టాక్ తెప్పించారు నిర్వాహకులు. అదే రోజు అర్ధరాత్రి మద్యం దొంగలించారు దొంగలు. దీంతో పాటుగా వైన్ షాపు పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలోనే ఉండడంతో చోరీ వ్యవహారం చర్చనీయంశంగా మారింది.

# ఉమాబాల బ్యాక్ గ్రౌండ్ ఇదే

ఏలూరు, ఫిబ్రవరి 7 వైసీపీ అధినేత జగన్ తాజాగా రిలీజ్ చేసిన ఆ పార్టీ ఆరో లిస్టులో పలు నియోజకవర్గాల్లో అభ్యర్థులకు షాకులు ఇచ్చారు. ఇంతకుముందు జాబితాల్లో వచ్చిన పేర్లను మళ్లీ మార్చేశారు. రాజమండ్రి లోక్‌సభ స్థానానికి ప్రముఖ డాక్టర్ అనసూరి పద్మలత పేరు ఇంతకుముందు ప్రకటించారు. ఆమె బీసీల్లో బలమైన శెట్టిబలిజ సామాజిక వర్గానికి చెందిన వారు. అయితే తాజా లిస్టుతో ఆమెకు బిగ్ షాక్ ఇచ్చారు. ఆమె ప్లేస్‌లో అదే శెట్టిబలిజ సామాజిక వర్గం నుంచి ఓ మహిళకు నరసాపురం పార్లమెంటులో అవకాశం ఇచ్చారు. నరసాపురం పార్లమెంటు వైసీపీ సమన్వయకర్తగా గూడూరి ఉమాబాలను నియమించారు. జగన్ నరసాపురం పార్లమెంటు సీటు నుంచి క్షత్రియ వర్గానికి చెందిన జీవీకే రంగరాజును పోటీ చేయాలని కోరారు ఆయన మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు తనయుడు. ప్రస్తుతం ఈ పార్లమెంటు నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్తగా కూడా ఉన్నారు. ఈ సీటు నుంచి వైసీపీ తరఫున గత ఎన్నికల్లోనూ క్షత్రియ వర్గానికే చెందిన రఘురామ కృష్ణంరాజు గెలిచి ఆ తర్వాత పార్టీకి దూరమయ్యారు. ఈ సారి అదే ఈక్వేషన్‌తో వెళ్లాలని జగన్ అనుకున్నా రంగరాజు ఒప్పుకోలేదు. . దీంతో జగన్ పూర్తిగా సోషల్ ఇంజనీరింగ్ పాటించి ఈ సీటును ప్రధాన పార్టీల తరఫున ఫస్ట్ టైం శెట్టిబలిజలకు కేటాయించారు. గతంలో మాత్రం చిరంజీవి ప్రజారాజ్యం పార్టీ పెట్టినప్పుడు ఇదే కమ్యూనిటీ నుంచి గుబ్బల తమ్మయ్యకు ( మాజీ మంత్రి పితాని సత్యనారాయణ బావ) సీటు ఇచ్చారు. మళ్లీ ఇప్పుడు జగన్ అదే కమ్యూనిటీ నుంచి ఓ మహిళకు అవకాశం ఇవ్వడం విశేషం. విచిత్రం ఏంటంటే నరసాపురం, రాజమహేంద్రవరం రెండు లోక్‌సభ సీట్లలో ఒక సీటు శెట్టిబలిజలకు ఇవ్వాలని జగన్ అనుకున్నారు. ఇప్పుడు అనూహ్యంగా రెండు సీట్లు ఇదే కమ్యూనిటికి ఇచ్చారు... రాజమండ్రిలో అనసూరి పద్మలత స్థానంలో కొద్ది రోజుల వరకు రాజమండ్రి సిటీ వైసీపీ సమన్వయకర్తగా పనిచేసిన డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌కు అక్కడ పార్లమెంటు సమన్వయకర్త బాధ్యతలు ఇచ్చారు. ఇక నరసాపురం సమన్వయకర్తగా వచ్చిన గూడూరి ఉమాబాల భీమవరం పట్టణానికి రాజకీయ నేపథ్యం ఉంది. ఆమె ప్రస్తుతం పశ్చిమగోదావరి జిల్లా వైసీపీ మహిళా విభాగం అధ్యక్షురాలిగా ఉన్నారు. జగన్ ఆరో లిస్టులో చేసిన తారుమార్ తక్కెడమార్‌లో ఓ శెట్టిబలిజ మహిళ పద్మలతో రాజమండ్రిలో సీటు కోల్పోగా అదే శెట్టిబలిజ మహిళ ఉమాబాలకు అనూహ్యంగా నరసాపురం పార్లమెంటు సీటు దక్కింది.

## లక్కు లేని కొణతాల

విశాఖపట్టణం, ఫిబ్రవరి 7కొణతాల రామకృష?ణ సీనియర్ నేత. ఉత్తరాంధ్ర జిల్లాలో ఆయన పేరు ప్రత్యేకంగా పరిచయం అక్కర లేదు. నాలుగు దశాబ్దాల రాజకీయంలో ఆయన గెలిచింది మూడు సార్లు మాత్రమే. అంటే విజయంలో ట్రాక్ రికార్డు మాత్రం అంత బాగా లేదనే చెప్పాలి. అనకాపల్లి పార్లమెంటు నియోజకవర్గం నుంచి రెండు సార్లు, అనకాపల్లి శాసనసభ స్థానం నుంచి ఒక్కసారి మాత్రమే కొణతాల రామకృష?ణ గెలిచారు. 1989, 1991 లో కాంగ్రెస్ నుంచి అనకాపల్లి పార్లమెంటుకు పోటీ చేసి విజయం సాధించారు. 2004లో అనకాపల్లి శాసనసభ నియోజకవర్గం నుంచి మరొకసారి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. అంతే తప్ప ఈయన రాజకీయ జీవితంలో గెలుపు కంటే ఓటములే ఎక్కువ అయితే కొణతాల రామకృష?ణ విభిన్నమైన వ్యక్తిత్వమున్న నేత. అలాగే అవినీతి మచ్చ అనేది రాజకీయ జీవితంలో అంటనూ లేదు. నెమ్మదైన స్వభావం.

# తిరుపతి ఆన్ లైన్ లో వీఐపీ బ్రేక్ దర్శనం

తిరుపతి, ఫిబ్రవరి 7 ,తిరుమల వేంకటేశ్వరుడిని దర్శించుకునేందుకు నిత్యం వేలాది మంది భక్తులు వస్తుంటారు. దీంతో ఏడుకొండలపై ఎప్పుడూ రద్దీగానే ఉంటుంది. స్వామివారి దర్శనానికే కాదు... దర్శనం టికెట్ల కోసం కూడా పెద్దపెద్ద క్యూలైన్లు ఉంటాయి. గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉండాల్సి వస్తుంది. ఈ క్రమంలో టీడీపీ మరో ప్రయోగాత్మక నిర్ణయం తీసుకుంది. వీఐపీ బ్రేక్ దర్శనం టికెట్ల తీసుకునే వారు.. క్యూలైన్ల నిలబడి కష్టపడకుండా... కీలక నిర్ణయం తీసుకుంది. తిరుమల వీఐపీ బ్రేక్ దర్శనం కోసం భక్తులు ఆన్‌లైన్‌లోనే టిక్కెట్లు కొనుగోలు చేసేలా... చర్యలు చేపడుతోంది తిరుపతి తిరుమల దేవస్థానం. క్యూలైన్‌లో భక్తులు నిలబడకుండా ఈ చర్యలు తీసుకుంటోంది. ప్రస్తుతం ఈ విధానాన్ని ప్రయోగాత్మకంగా ఆచరణలో పెట్టింది టీటీడీ. త్వరలోనే పూర్తిస్థాయిలో అమలు చేయాలని నిర్ణయం తీసుకోనుంది. ఇప్పటి వరకు చూస్తే ఓఃఅ (ఎంబీసీ) 34లోని కౌంటర్ దగ్గర వీఐపీ బ్రేక్ దర్శనం టికెట్ల కోసం భక్తులు ఎక్కువ సేపు క్యూలైన్‌లో వేచి ఉండాల్సిన పరిస్థితి ఉంది. దీంతో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఈ కొత్త విధానాన్ని అమలు చేస్తోంది. సిఫార్సు లేఖలు అందజేసిన భక్తుల మొబైల్‌కు ఓ లింక్‌తో కూడిన మెసేజ్ పంపుతున్నారు. భక్తులు ఆ లింకుపై క్లిక్ చేస్తే పేమెంట్ ఆప్షన్ కనిపిస్తుంది. అప్పుడు డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. ఇలా ఆన్‌లైన్‌లోనే నగదు చెల్లించిన తర్వాత టికెట్ డౌన్‌లోడ్ చేసుకునే ఆప్షన్ ఉంటుంది. రెండు రోజుల నుంచి ఈ కొత్త విధానాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేస్తోంది టీటీడీ. ఈ కొత్త విధానంపై భక్తుల నుంచి అభిప్రాయాలు సేకరిస్తోంది. ఈ కొత్త విధానాన్ని త్వరలోనే పూర్తిస్థాయిలో అమలు చేయబోతోంది. దీని వల్ల చాలా మంది భక్తులకు క్యూలైన్ల నిలబడకుండా ఉపసమనం కలగనుంది.ఇక... తిరుమలలో నిర్వహించిన మూడు రోజుల ధార్మిక సదస్సులో పాల్గొన్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. తిరుమలలోని 108 తీర్థాలను భక్తులు సందర్శించేలా ఏర్పాటు చేస్తామన్నారు. శిథిలావస్థలో ఉన్న ఆలయాలను పునరుద్ధరిస్తామని... బడుగు బలహీన వర్గాల కోసం నూతన ఆలయాలను నిర్మిస్తామని చెప్పారు. తిరుమలలో అన్యమత ప్రచారం జరగకుండా... మతాంతీకరణలను అడ్డుకునేందుకు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తామని చెప్పారు. తిరుమలలో మాదిరిగానే తిరుపతిలో కూడా సంపూర్ణమైన ఆధ్యాత్మిక వాతావరణాన్ని, భక్తి భావనను కలిగించేలా చర్యలు చేపడతామని చెప్పారు భూమన కరుణాకర్‌రెడ్డి.మరోవైపు... రథసప్తమి వేడుకల సందర్భంగా... ఫిబ్రవరిలో మూడు రోజుల పాటు సర్వదర్శనం టోకెన్లను రద్దు చేస్తున్నట్లు టీటీడీ ప్రకటించింది. ఈనెల 15, 16, 17 తేదీల్లో సర్వదర్శనం టోకెన్లను రద్దు చేస్తున్నట్లు టీటీడీ ఈవో ధర్మారెడ్డి ప్రకటించారు.. రథ సప్తమి రోజు వీఐపీ బ్రేక్ దర్శనాన్ని కూడా రద్దు చేశారు. అంతేకాదు.. వృద్ధులు, వికలాంగులు, చంటి పిల్లల తల్లిదండ్రులకు ప్రత్యేక దర్శనం కూడా రథసప్తమి రోజు ఉండదని స్పష్టం చేశారు. ఆ రోజు ఆర్జిత సేవలను కూడా రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు టీటీడీ ఈవో ధర్మారెడ్డి.

# 2014 కూటమి రెడీ అవుతుందా..

విజయవాడ, ఫిబ్రవరి 7,ఆంధ్రప్రదేశ్‌లో అధికార వైసీపీని ఎదుర్కొనేందుకు తెలుగుదేశం పార్టీ, జనసేన కూటమిగా బరిలోకి దిగేందుకు సిద్ధమయ్యాయి. సీట్లపై ఇప్పటికే చర్చలు తుది దశకు చేరుకున్నాయి. ఈ కూటమిలో బిజెపిని భాగస్వామిగా చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. దీనిపై బీజేపీ అగ్రనాయకత్వం ఆచితూచి స్పందిస్తూ వచ్చింది. అటు అధికార పార్టీకి పూర్తి సహకారం అందిస్తూనే ఇటు టీడీపీ, జనసేనతోనూ సన్నిహితంగా మెలుగుతోంది. ఇలా సాగుతున్నా పొత్తు విషయం బిజెపి అగ్రనాయకత్వం తేల్చకపోవడంతో టీడీపీ జనసేన కూటమిగానే ప్రజల్లోకి వెళ్లేందుకు సిద్ధమయ్యాయి టిడిపి అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ శేట్ల సర్దుబాటుపై చర్చలు జరిపి ఒక నిర్ణయానికి వచ్చినట్లు చెబుతున్నారు. రాష్ట్రంలో ఒంటరిగా పోటీ చేయాలన్న బిజెపి నిర్ణయంపై కీలక నేతలు వారించినట్లు టాక్ నడుస్తోంది. పొత్తుతో వెళ్లడం వల్ల రెండు మూడు పార్లమెంటు స్థానాలతో పాటు కొన్ని అసెంబ్లీ స్థానాల్లో విజయం సాధించేందుకు అవకాశం ఉంటుందని, ఆ దిశగా ఆలోచన చేయాలంటూ రాష్ట్రానికి చెందిన కీలక నేతలు అగ్రనాయకత్వానికి సూచించినట్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే బిజెపి అగ్ర నాయకత్వం రాష్ట్రంలో టిడిపి, జనసేన కూటమిలో చేరేందుకు సానుకూలంగా స్పందించినట్టు పొలిటికల్ సర్కిల్‌లో ఓ చర్చ నడుస్తోంది. రాష్ట్రంలో కూటమిలో చేరేందుకు బిజెపి అగ్రనాయకత్వం సంసిద్ధతను వ్యక్తం చేసిన వెంటనే.. జనసేన అగ్రనేతలకు.. బిజెపి ముఖ్య నాయకుల నుంచి సమాచారం అందినట్లు ప్రచారం జరుగుతోంది. పొత్తులపై మాట్లాడుకుందామని బీజేపీ అధిష్టానం నుంచి సంకేతాలు అందినట్లు చెబుతున్నారు. సీట్ల పంపకాలపై టీడీపీ, జనసేన నేతల మధ్య పలు దఫాలుగా చర్చలు జరిగిన నేపథ్యంలో బిజెపికి ఇవ్వబోయే సీట్ల విషయంలో చర్చించేందుకు సిద్ధంగా ఉండాలని బిజెపి అగ్రనాయకత్వం నుంచి ముఖ్య నేతలకు సమాచారాన్ని పంపించినట్లు చెబుతున్నారు. సీట్ల సర్దుబాటులో స్థానాల సంఖ్య, ఏ స్థానాల్లో ఎవరు పోటీ చేయాలనే అంశంపై బిజెపి కూటమి నేతలతో చర్చలు జరపనుంది. ఇప్పటికే పలు విడతల్లో చర్చించిన జనసేన అధినేత పవన్ టిడిపి అధినేత చంద్రబాబు ఈ నెల 8వ తేదీన మరోసారి సమావేశమై సీట్ల పంపకాలు విషయాన్ని కొలిక్కి తీసుకురావాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలోనే బిజెపి నుంచి సానుకూల స్పందన రావడంతో ఒక్కసారిగా కూటమి లెక్కలు మారనున్నాయి. బిజెపి అగ్రనాయకత్వం పార్లమెంటు స్థానాలను ఎక్కువగా ఆశిస్తోంది.

అందుకు ఇరు పార్టీలు అంగీకారాన్ని తెలుపుతాయా లేదా అన్నది తేలాల్సి ఉంది. బిజెపి కోరిన పార్లమెంటు స్థానాలను ఇచ్చేందుకు ఇరు పార్టీలు అంగీకరిస్తే పొత్తు చర్చలు కొలిక్కి వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు. కూటమిలో బిజెపి చేరేది, లేనిది అన్న విషయంపై స్పష్టత కూడా ఈ నెల 8వ తేదీన జనసేన అధినేత పవన్ కళ్యాణ్, టిడిపి అధినేత చంద్రబాబు మధ్య జరగనున్న చర్చల్లో స్పష్టత రానుంది. తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ తో టచ్ లోకి వచ్చిన బిజెపి అగ్ర నాయకులు.. ఒకటి రెండు రోజుల్లో వీరితో చర్చలు జరిపే అవకాశం ఉందని చెబుతున్నారు. రాష్ట్రంలో ఒంటరిగా పోటీ చేయాలన్న బిజెపి అగ్రనాయకత్వం నిర్ణయంపై రాష్ట్రంలోని నాయకులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. పొత్తుతో వెళ్లడం వల్ల మేలు జరుగుతుందని పలువురు అగ్రనాయకత్వానికి సూచిస్తుండగా.. ఒంటరిగా వెళ్లి క్షేత్రస్థాయిలో బలాన్ని తెలుసుకొని.. భవిష్యత్తులో పార్టీని బలోపేతం చేయడంపై దృష్టి సారించడం మేలని మరి కొంతమంది సూచిస్తున్నారు. కానీ వచ్చే ఎన్నికలు బిజెపికి కీలకం కావడంతో.. రాష్ట్రంలోని ప్రధాన పార్టీలతో పొత్తు పెట్టుకోవడం వలన ఎక్కడ వచ్చే పార్లమెంటు స్థానాలు కేంద్రంలో అధికారాన్ని నిలబెట్టుకునేందుకు అవకాశం ఉంటుందని బిజెపి హై కమాండ్ భావిస్తోంది. ఈ నేపథ్యంలోనే పొత్తుకు సిద్ధపడుతున్నట్లు చెబుతున్నారు. పొత్తు చర్చలు పూర్తయిన తర్వాతే దీనిపై ఒక స్పష్టత వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు. చూడాలి మరి రాష్ట్రంలో ఏర్పాటుచేసిన కూటమిలో బిజెపి చేరుతుందో.. లేదో వేచి చూడాలి

# విశాఖ వైసీపీలో ఏం జరుగుతోంది



విశాఖపట్టణం, ఫిబ్రవరి 7 ,సీఎం జగన్మోహన్‌రెడ్డి వచ్చే ఎన్నికల్లో వై నాట్ 175 నినాదంతో ముందుకు వెళుతున్నారు. అందుకు అనుగుణంగానే సర్వేలు చేయిస్తూ గెలుపు గుర్రాలను బరిలో దించేందుకు సిద్ధమవుతున్నారు. కానీ, వైసీపీలో నేతల మధ్య ఉన్న విభేదాలు పార్టీకి ముప్పు తెచ్చేలా కనిపిస్తున్నాయంటూ కేడర్ ఆవేదన వ్యక్తం చేస్తోంది. నేతలు మధ్య విభేధాలు ఉన్న నియోజకవర్గాలు జాబితాలో విశాఖలోని తూర్పు నియోజకవర్గం ఒకటిగా చెబుతున్నారు. ఇక్కడ నుంచి వచ్చే ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధపడుతున్నారు ప్రస్తుత విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ. కానీ, ఈయనకు స్థానిక నేతలు ఆశించిన స్థాయిలో సహకారాన్ని అందించడం లేదన్న ప్రచారం ఉంది.గత ఎన్నికల్లో ఇదే నియోజకవర్గం నుంచి పోటీ చేసి.. ప్రస్తుతం వీఎంఆర్‌డీఏ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న అక్కరమాని విజయ నిర్మల, ఆయన భర్త వెంకటరావు గడిచిన కొన్నాళ్లు నుంచి పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ వస్తున్నారు. భీమిలిలో నిర్వహించిన తొలి సిద్ధం సభకు కూడా ఈ దంపతులు హాజరు కాలేదు. అలాగే, ఇదే నియోజకవర్గ పరిధిలో ఉంటున్న మేయర్ గొలగాని హరి వెంకటకుమారి దంపతులు కూడా ఎంపీ ఎంవీవీ సత్యనారాయణతో అంటీ, ముట్టనట్టుగానే వ్యవహరిస్తున్నారు. ఎంపీ ఎంవీవీని తూర్పు ఇన్‌చార్జ్‌గా నియమించిన తరువాతే వైసీపీలో కొన్నాళ్లు నుంచి ఉన్న ఎమ్మెల్సీ వంశీ కృష్ణ శ్రీనివాస్‌యాదవ్.. బయటకు వెళ్లిపోయి జనసేనలో చేరారు. ఈ వ్యవహారాలన్నీ తూర్పు వైసీపీలో కొంత ఇబ్బందికరంగా కనిపిస్తున్నట్టు కేడర్ చెబుతోంది. విశాఖ నగర పరిధిలోని తూర్పు నియోజకవర్గంలో ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు వ్యవహరిస్తున్నారు. గడిచిన మూడు ఎన్నికల్లోనూ ఈయన ఇక్కడి నుంచి విజయం సాధించారు. ఎమ్మెల్యే వెలగపూడి చేతిలో రెండు సార్లు వంశీకృష్ణ శ్రీనివాస్, ఒకసారి అక్కరమాని విజయనిర్మల ఓటమి చవి చూశారు. సిటీ పరిధిలో తెలుగుదేశం పార్టీ బలంగా ఉండడంతోపాటు ఎమ్మెల్యే వెలగపూడి వ్యక్తిగత ఇమేజ్ ఆయన విజయానికి దోహదం చేస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో వెలగపూడిని వచ్చే ఎన్నికల్లో ఓడించడమే లక్ష్యంగా పెట్టుకున్న వైసీపీ అధిష్టానం.. ఇందుకోసం బలమైన అభ్యర్థిని బరిలోకి దించాలని భావించింది. ఈ నేపథ్యంలోనే ఆర్థికంగా బలంగా ఉన్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణను ఇక్కడ ఇన్‌చార్జ్‌గా నియమించింది.పార్టీ అప్పగించిన బాధ్యతలు మేరకు ఎంవీవీ సత్యనారాయణ తొలి రోజు నుంచే క్షేత్రస్థాయిలో తిరుగుతూ ప్రజలతో మమేకమయ్యే ప్రయత్నం చేస్తున్నారు. వైసీపీ కేడర్‌ను కూడా తన వెంట నడిచేలా చేస్తున్నారు. కానీ, ఇంటి పోరు ఆయనకు ఎంత వరకు ఇబ్బందిని కలిగిస్తుందన్నది తెలియడం లేదు. మొన్నటి వరకు ఉప్పు, నిప్పులా ఉన్న వెలగపూడి, వంశీకృష్ణ శ్రీనివాస్ ఇప్పుడు ఒకే వేదికపైకి (కూటమి) చేరినట్టి అయింది. వీరిద్దరిని తట్టుకుని ఢీ కొట్టడం ఎంవీవీ సత్యనారాయణకు అంత సులభమేమీ కాదు. కానీ, వైసీపీ ప్రభుత్వం చేసిన మేలు కలిసి వస్తుందని ఆయన చెబుతున్నారు. ఎమ్మెల్యే వెలగపూడి మాదిరిగానే ప్రజలతో మమేకం కావడం, అందరికీ అందుబాటులో ఉంటాడన్న పేరు తెచ్చుకోవడం కూడా ఎంపీకి కలిసి వస్తుందని చెబుతున్నారు. తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ఎంపీ ఎంవీవీ సత్యనారాయణను నియమించినప్పటి నుంచి నిరాశలో కూరుకుపోయారు ఇక్కడి తాజా మాజీ ఇన్‌చార్జ్ అక్కరమాని విజయనిర్మల, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్, మేయర్ గొలగాని హరి వెంకటకుమారి. ఈ ముగ్గురు నేతలు వచ్చే ఎన్నికల్లో ఈ నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని ఆశపడ్డారు. కానీ, అధిష్టానం నుంచి ఆ దిశగా హామీ లభించకపోవడంతోపాటు ఎంపీకి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో వంశీకృష్ణ శ్రీనివాస్‌యాదవ్ పార్టీ మారిపోయారు. పార్టీలోనే ఉన్నప్పటికీ కార్యక్రమాలకు అంటీముట్టనట్టుగా వ్యవహరిస్తున్న అక్కరమాని దంపతులు, మేయర్ దంపతులు మాత్రం మధ్యస్తంగా మెలుగుతూ రాజకీయాలను నెరుపుకుంటూ పోతున్నారు. తూర్పులో కాకపోయినా గాజువాకలో అయినా అవకాశం ఇవ్వాలని మేయర్ దంపతులు అధిష్టానాన్ని కోరుతున్నారు. విశాఖ నగరంలో కీలకమైన తూర్పు నియోజకవర్గంలో వైసీపీలో నెలకొన్న అసంతృప్తులను అధిష్టానం ఎంత వరకు సమసిపోయేలా చేస్తుందో.


# రాయలసీమలో మూడో సభ

కడప, ఫిబ్రవరి 7 సార్వత్రిక ఎన్నిలకు కేడర్‌ను సన్నద్ధం చేసేందుకు అధికార వైసీపీ సిద్ధం పేరుతో నిర్వహించనున్న మూడో సభకు రాయలసీమ వేదికగా మారింది. తొలి సభను ఉత్తరాంధ్ర జిల్లాలకు సంబంధించి విశాఖ జిల్లా భీమిలి నియోజకవర్గ పరిధిలోని సంగివలసలో నిర్వహించగా, రెండో సభను ఉమ్మడి ఉభయగోదావరి, కృష్ణా జిల్లాలకు సంబంధించి ఏలూరు పరిధిలోని దెందులూరు నియోజకవర్గం దగ్గరలో నిర్వహించారు. రెండు చోట్ల భారీ ఎత్తున కేడర్ హాజరు కావడంతో సభలు గ్రాండ్ సక్సెస్ అయినట్టు పార్టీ నాయకులు చెబుతున్నారు. మూడో సభను సీఎం జగన్మోహన్‌రెడ్డి సొంత అడ్డాగా చెప్పుకునే రాయలసీమలో వైసీపీ నిర్వహిస్తోంది. రాయలసీమలోని అనంతపురం జిల్లా పరిధిలోని రాప్తాడు నియోజకవర్గంలో ఈ సభ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 11 మూడో సిద్ధం సభను నిర్వహించనున్నారు. ఇప్పటి వరకు నిర్వహించిన రెండు సభలకు ధీటుగా ఈ సభను నిర్వహించేందుకు అధికార వైసీపీ నేతలు సన్నాహాలు చేస్తున్నారు. కనీసం ఐదు లక్షల మందితో సభ నిర్వహించనున్నట్టు వైసీపీ నాయకులు చెబుతున్నారు. రాప్తాడు మండల కేంద్రంలోని ఆటో నగర సమీపంలో రాయలసీమ స్థాయిలో సభను నిర్వహిస్తున్నారు. సభకు సంబంధించిన ఏర్పాట్లను వైసీపీ ముఖ్య నేతలు పరిశీలించారు. బహిరంగ సభా స్థలి వద్ద జరుగుతున్న ఏర్పాట్లపై సోమవారం సాయంత్రం, మంగళవారం ఉదయం అనంతపురం, రూరల్ డీఎస్పీలు, ఇతర అధికారులతో ముఖ్య నాయకులు సమీక్షించారు. సీఎం ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్ తలశిల రఘురాంతోపాటు ఎమ్మెల్యేలు అనంత వెంకట్రామిరెడ్డి, రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌తోపాటు ఇతర ముఖ్య నేతలు అధికారులతో చర్చించి ఏర్పాట్లను పరిశీలించారు. సభకు భారీ ఎత్తున కార్యకర్తలు వచ్చే అవకాశమున్నందున అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని పార్టీ నాయకులకు సూచించారు. ఇక్కడ సభను గ్రాండ్ సక్సెస్ చేయడం ద్వారా జగన్మోహన్‌రెడ్డికి రాయలసీమ బెల్ట్‌లో తిరుగులేదన్న విషయాన్ని మరోసారి తెలియజేయాలని ఇక్కడి నేతలు భావిస్తున్నారు. సభను విజయవంతం చేయడాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నేతలు.. అందుకు అనుగుణంగా కేడర్‌ను సభకు తీసుకురావడంపై దృష్టి సారించారు.

# టీడీపీలో అభ్యర్థుల గుబులు

కాకినాడ, ఫిబ్రవరి 7 ,జనసేనకు పట్టున్న ప్రాంతంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కీలకంగా నిలుస్తుందనడంలో ఎటువంటి సందేహం లేదు. ఇందులో ముఖ్యంగా కాకినాడ, అంబేద్కర్ కోనసీమ జిల్లాలో అయితే జనసేనకు ఉన్న పట్టు మరింత బలీయమైనదనే విశ్లేషకులు చెబుతుంటారు.. ఈనేపథ్యంలోనే జనసేన అధినేత పవన్ కల్యాణ్ కాకినాడ జిల్లా పరిధిలోకి వచ్చే అన్నవరం నుంచే తన వారాహి యాత్రను ప్రారంభించారు.. మొదటి దశలో చేపట్టిన ఈ యాత్ర సూపర్ సక్సెస్ అయ్యింది కూడా.. వారాహి యాత్రతోపాటు భారీ బహిరంగ సభల ద్వారా పవన్ కల్యాణ్ కేడర్‌లో ఫుల్ జోష్ నింపారు.కాకినాడ సభలో అయితే సిట్టింగ్ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ మీద నిప్పులు చెరిగారు పవన్. దీంతో రాష్ట్రంలో ఎన్నికల వాతావరణం వచ్చినట్లయ్యింది. అయితే అదే ఊపుతో ఉమ్మడి తూర్పులో జనసైనికులు అంతే ఉత్సాహంగా పార్టీ కోసం పని చేయడమే కాకుండా సోషల్ మీడియా వేదికగా అధికార పార్టీపై విస్తృతంగా విమర్శలు గుప్పించారు. ఇది పార్టీని ప్రజల్లోకి మరింత తీసుకెళ్లిన పరిస్థితి కనిపించింది.అయితే ఇప్పుడు టీడీపీ, జనసేన కలిసి ఎన్నికల బరిలో నిలుస్తుండడంతో కొందరు తమ టిక్కెట్టును కోల్పోయే పరిస్థితి కనిపిస్తోంది.. ఇప్పటికే పలు నియోజకవర్గాల్లో టీడీపీ పోటీ చేయబోతోందని సమాచారం అందడంతో తీవ్ర నిరాసలో కూరుకుపోవడమే కాకుండా అవసరమైతే రెబల్‌గానైనా రంగంలోకి దిగాలన్న ఆలోచనలో కొందరు ఉన్నారన్న సమాచారంఇటీవల గణతంత్ర దినోత్సవం రోజున జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రెండు నియోజకవర్గాల్లో జనసేన పోటీ చేస్తుందని ప్రకటించడం స్థానికంగా కలకలం రేపింది. తూర్పుగోదావరి జిల్లాలో రాజానగరం నియోజవకర్గం, అంబేద్కర్ కోనసీమ జిల్లా రాజోలు నుంచి జనసేన అభ్యర్థులు పోటీ చేస్తారని ప్రకటించడం అక్కడి టీడీపీ అభ్యర్థుల్లో గుబులు రేపగా టీడీపీ అభ్యర్థులు పోటీ చేసే చోట అవసరమైతే రెబల్‌గా రంగంలోకి దిగుతామని జనసేనకు చెందిన మరికొందరు నాయకులు తమ అనుచరుల వద్ద చెప్పుకోవడం అక్కడ పోటీ చేస్తున్న టీడీపీ అభ్యర్థుల్లో గుబులు రేగుతోందట. ఏదిఏమైనా టీడీపీ అభ్యర్థులకు టిక్కెట్టు కేటాయించినా, జనసేన అభ్యర్థులకు టిక్కెట్టు కేటాయించినా చివరకు టీడీపీ అభ్యర్థులకే గుబులు రేగుతోందట.. అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో రాజోలు, రామచంద్రపురం నియోజకవర్గాలలో జనసేన అభ్యర్థులు పోటీ చేస్తారన్న సమాచారం బాగా ప్రచారం జరుగుతోంది. మరోపక్క పి.గన్నవరం అమలాపురం నియోజకవర్గాలు కూడా జనసేన ఖాతాల్లోకి వెళ్లబోతున్నాయన్న ప్రచారం రెండు రోజులుగా జరుగుతోంది. అయితే ఒకే జిల్లాలో మూడు ఎస్సీ రిజర్వుడు స్థానాలు జనసేనకు ఎలా ఇస్తారు అన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. రాజోలు, పి.గన్నవరం, అమలాపురం మూడు నియోజకవర్గాలు ఎస్సీ రిజర్వుడు స్థానాలు.. రాజోలు, పి.గన్నవరం జనసేనకు కేటాయించినా అమలాపురం మాత్రం టీడీపీకి దక్కనుందని తెలుస్తోంది. ఇక్కడ జనసేన అభ్యర్థి శెట్టిబత్తుల రాజబాబు ఇప్పటికే ప్రజాసంకల్పయాత్ర పేరుతో ప్రజల్లో తిరుగుతున్నారు. ఈనేపథ్యంలో తనకు టిక్కెట్టు దక్కకపోతే అవసరమైతే రెబల్‌గా రంగంలోకి దిగుతారని ప్రచారం జరుగుతోంది.. ఈవార్త టీడీపీ ఆశావాహుల్లో టెన్షన్ పెట్టిస్తుందట. అయితే ఇదే పరిస్థితి రాజోలు, కాకినాడ రూరల్ తదితర నియోజకవర్గాల్లో కనిపిస్తోంది.

## 10.02.2024 నుండి 19.02.2024 వరకు సూర్య దేవాలయం లో రాజ శ్యామల నవరాత్రులు..



విభారె న్యూస్ ఫిబ్రవరి 07 కర్నూలు (జిల్లా ప్రతినిధి) ..10.02.2024 మాఘశుద్ధ పాడ్యమి శనివారం నుండి 19.02.2024 మాఘశుద్ధ దశమి సోమవారం పర్యంతము శ్రీ సూర్యనారాయణ స్వామి దేవాలయంలో శ్రీ మహా గౌరీ అమ్మవారికి శ్రీవిద్య సంప్రదాయానుసారం శ్రీ రాజశ్యామల నవరాత్రులు గుప్తనవరాత్రులు నిర్వహించబడును. ప్రతి రోజు శ్రీ రాజశ్యామల మూల మంత్ర అనుష్టానము అభిషేకం, శ్రీ రాజశ్యామల సహస్ర నామ, శ్రీ లలితా సహస్రనామ అర్చనలు, జరుగును. శ్రీ లలితా మహాత్రిపుర సుందరి దేవి యొక్క ప్రధాన మంత్రణియైన శ్రీ రాజశ్యామలా దేవి గొప్ప సంమ్మోహన శక్తి ఈ అమ్మ అనుగ్రహం వలన ఉన్నత పదవీ, ఉద్యోగ, విద్యా, వ్యాపార, లాభాలు పొందవచ్చును. సకల దాంపత్య శత్రు, రుణ, రోగ, బాధలు, తొలగి ఆయురారోగ్య ఐశ్వర్యములు సిద్ధించును. సంకల్పం 9 రోజులకు:-300/-సంప్రదించవలసిన నెంబరు:డి లక్ష్మీనరసింహాశర్మ.. 8008774086 దేవాలయం ఫోన్ పే గూగుల్ పే నెంబరు:8896123777

## పోలీసుల వాహనాల తనిఖీలు



విభారె న్యూస్ ఫిబ్రవరి 07 కర్నూలు (జిల్లా ప్రతినిధి).. భారీగా పట్టుబడిన నగదు మొత్తం విలువ రూ. 60 లక్షలు. నగదును స్వాధీనం చేసుకున్న కర్నూలు తాలుకా, సెబ్ పోలీసులు. తనిఖీల్లో పాల్గొన్న పోలీసులను ప్రత్యేకంగా అభినందించిన జిల్లా ఎస్పీ జి. కృష్ణకాంత్ ఐపియస్ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కర్నూలు జిల్లా ఎస్పీ జి. కృష్ణ కాంత్ ఐపీఎస్ ఆదేశాల మేరకు తెల్లవారుజామున కర్నూలు జిల్లా సరిహద్దు పంచలింగాల చెక్ పోస్టు వద్ద పోలీసు అధికారుల కు వచ్చిన సమాచారంతో తనిఖీలు చేపట్టారు . హైదరాబాదు నుండి బెంగుళూరు వెళుతున్న కే ఎస్ ఎం ప్రవేట్ ట్రావెల్స్ బస్సులో ప్రయాణిస్తున్న అనంత ఇంజనీరింగ్, ఇన్ ఫ్రాస్ట్రక్చర్స్ కంపెనీకి చెందిన జిలానీ,సుమన్ అనే వ్యక్తుల నుండి ఏలాంటి ఆధారాలు లేని రూ. 60 లక్షల నగదు ను కర్నూలు తాలుకా మరియు సెబ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీజ్ చేసిన 60 లక్షల నగదు ను రెవిన్యూ అధికారుల సమక్షంలో ఆ మొత్తాన్ని స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణకు ఆదాయపు పన్ను శాఖ వారికి లేఖ వ్రాయడమైనది. ఈ తనిఖీల్లో పాల్గొన్న కర్నూలు తాలుకా సిఐ శ్రీధర్, సెబ్ ఎస్సై పృధ్వీరాజ్ పోలీసు సిబ్బంది నిజిల్లా ఎస్పీ జి. కృష్ణకాంత్ ఐపియస్ ప్రత్యేక అభినందించారు.

## పారిశుధ్య పనులలో ఆలసత్వం వద్దు

### మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 07. పారిశుద్ధ్య పనుల యందు అలసత్వం వీడాలని నంద్యాల మున్సిపల్ కమిష నర్ నిరంజన్ రెడ్డి అన్నారు. బుధవారం పట్టణం లో జరుగుతున్న పారిశుద్ధ్య వారోత్సవాలను ఆయన పరిశీలించారు. ప్రజలకు స్వచ్ఛమైన వాతావరణం కల్పించడంతో పాటు మౌలిక సదుపా యాలను మెరగుపరిచేందుకు సిబ్బంది కృషి చేయా లన్నారు. కాల్వల్లో పేరుకుపోయిన చెత్తను ఎప్పటిక ప్పుడు శుభ్రం చేయాలని సూచించారు. నీటి సమస్య రాకుండా కొళాయిలను, నీటి పైపుల లీకేజీలను గుర్తించాలన్నారు. ప్రతి వార్డులో ఫాగింగ్ పనులను పరిశీలించారు. స్ప్రేయింగ్ చేయిస్తూ దోమలను అరికట్టాలన్నారు డాక్టర్ అంకిరెడ్డి. శానిటేషన్ సూపరైజర్ లక్ష్మినారా యణ. శివ ప్రసాద్ రెడ్డి. మున్సిపల్ సిబ్బంది సచివాలయ సిబ్బంది ఉన్నారు.



# హిట్ అండ్ రన్ చట్టం రద్దు చేయాలి....

విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి :- ఫిబ్రవరి 7 రోడ్డు ప్రమాదాలకు డ్రైవర్లను బాధ్యులను చేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకు వస్తున్నడ్రైవర్ల మేడకు ఉరితాడు లాంటి భారత న్యాయ సంహిత 2023 హిట్ అండ్ రన్ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని మోటార్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష,కార్యదర్శులు ఏ.వి.భాస్కర్ రెడ్డి,టి.శివరాంకేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మంగళవారం స్థానిక మోటార్ వర్కర్స్ యూనియన్ కార్యాలయం నందు భాస్కర్ రెడ్డి అధ్యక్షతన రవాణా రంగ కార్మికుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ చట్టంలోని సెక్షన్ 106/1 ప్రకారం ప్రమాదానికి కారణం అయిన డ్రైవర్ కు పదేళ్ల జైలు శిక్ష,7 లక్షల జరిమానా,ప్రమాదం జరిగిన ప్రాంతం నుంచి డ్రైవర్ పారిపోతే హిట్ అండ్ రన్ సెక్షన్ 106/2 ప్రకారం పదేళ్ల జైలు,10 లక్షల జరిమానా విధింపును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు.అనుకోకుండా జరిగే ప్రమాదాలకు అనేక రకాల కారణాలు ఉంటాయని వాటికి డ్రైవర్లను బాధ్యులను చేయడం ఎంతవరకు సమంజసం అని,ప్రమాదం జరిగిన ప్రాంతంలోనే డ్రైవర్ ఉండాలంటే అతని ప్రాణాలకు రక్షణ ఎక్కడ ఉంటుందని వారు ప్రశ్నించారు.దేశానికి వెన్నెముక లాంటి రవాణా రంగంలో ప్రజా రవాణా,సరుకు రవాణా చేసే ఆటోలు మొదలుకొని భారీ వాహనాల డ్రైవర్లుదిన దిన గండం నూరేళ్ల ఆయుష్షు అన్నట్టు అత్యంత ప్రమాదకరమైన వృత్తిని జీవనాధారంగా చేసుకొని కుటుంబాలను పోషించుకుం టున్నారన్నారు.డ్రైవర్లకు ఈ ప్రభుత్వాలు ఎలాంటి సంక్షేమ పథకాలు అందించడం లేదని రవాణా రంగంలో పనిచేసే కార్మికుల పట్ల కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా వివక్ష చూపుతున్నాయన్నారు.




అయితే జరుగుతున్న ప్రమాదాలకు మాత్రం వాహన డ్రైవర్లే కారణమంటూ కేంద్ర ప్రభుత్వం జైలు శిక్షలు,లక్షల రూపాయల జరిమినాలు కట్టాలని చట్టాన్ని రూపొందించడం దారుణం అన్నారు.ఈ చట్టం అమల్లోకి రావడం వల్ల తమ బ్రతుకులు అధోగతి పాలు అవుతాయని డ్రైవర్లు తీవ్ర భయాందోళనలకు గురి అవుతున్నారన్నారు.ఇప్పటికే ప్రమాదకరమైన ఈ వృత్తి లోకి రావడానికి ఎవరూ ముందుకు రావడం లేదని దేశవ్యాప్తంగా రవాణా వాహనాలకు30 శాతానికి పైగా డ్రైవర్ల కొరత ఉన్నదని ప్రభుత్వ గణాంకాలు తెలియజేయడమే ఇందుకు నిదర్శనం అన్నారు.అమెరికా,బ్రిటన్ తదితర దేశాలలో రోడ్డు ప్రమాదాలపై ప్రాథమిక విచారణకు పోలీసులతో పాటు నిపుణుల కమిటీ ఉంటుందని నిష్పక్షపాతంగా ప్రమాదాలకు వాస్తవ కారణాలు పరిశీలించాకే వాటి ఆధారంగా ఛార్జిషీటు దాకలవుతుందన్నారు.కానీ మన దేశంలో అటువంటి పరిస్థితులు లేవన్నారు.రవాణా రంగాన్ని మన ప్రభుత్వాలు ఆదాయ వనరుగా మార్చుకొని అధిక పన్నులతో పీల్చి పిప్పి చేస్తూ తీవ్ర సంక్షోభంలోకి నెట్టాయన్నారు.రవాణా రంగ కార్మికుల తో పాటు వాహన యజమానుల పరిస్థితులు కూడా దారుణాతి దారుణంగా ఉన్నాయన్నారు.ప్రమాదాలకు అసలు కారణాలను పరిశీలించి,సమస్యలను పరిష్కరించాలని,రోడ్ల వెడల్పు తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని,ప్రజలలో రహదారి భద్రతా నియమాల పట్ల అవగాహన కల్పించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించడానికి చర్యలు తీసుకోవాలన్నారు.ఇవేవీ చేయకుండా ప్రభుత్వాలు తమ కర్తవ్యాలను విస్మరించి డ్రైవర్లను శిక్షించినంత మాత్రాన ప్రమాదాల నివారణ సాధ్యం కాదన్నారు.అలాగే పెట్రోల్,డీజిల్ ధరలను,ప్రభుత్వ పన్నులను,టోల్ ఛార్జీలను తగ్గించి రవాణా రంగాన్ని కాపాడాలన్నారు. దేశవ్యాప్తంగా రవాణా రంగంపై ఆధారపడి కోట్లాది కుటుంబాలు ఉపాధి పొందుతున్న విషయాన్ని మరవకూడదు అన్నారు.ఏది ఏమైనా డ్రైవర్ల మెడకు ఉరి తాడు లాంటి చట్టాలను వెంటనే రద్దు చేయాలని లేనియెడల రవాణా రంగం తో పాటు దాని అనుబంధ రంగాల కార్మికులను,వాహన యజమానులను ఐక్యం చేసి ఉద్యమాలను ఉధృతం చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో మోటార్ వర్కర్స్ యూనియన్ కమిటీ సభ్యులు హుస్సేన్ పీరా,శివరంగస్వామి, ఆదినారాయణ రెడ్డి, ధనుంజయ గౌడు,ఆజీపీరా, జబ్బార్,ఆటో యూనియన్ నాయకులు మద్దయ్య,మహేష్, శ్రీనివాసులు,వెంకటేశ్వర రెడ్డి, సూరన్న,బాలు,నాగేశ్వరరావు, బాబు,ప్రైవేట్ స్కూల్ బస్సు యూనియన్ నాయకులు మద్దిలేటి,నూర్ భాషా,ఖాసీం ,కంబగిరి,ఆర్టీసీ హయర్ బస్సు యూనియన్ నాయకులు సుబ్బయ్య గౌడు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## పేద ప్రజల కోసం "మోది క్యాంటీన్" కు పరిమిషన్ ఇవ్వండి

### కలెక్టర్ కు వినతిపత్రం ఇచ్చిన అభిరుచి మదు

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి07 -పేదలకు ఆకలి తీర్చడానికి మోది అన్నా క్యాంటీన్ ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని కలెక్టర్ కు బుధవారం బిజెపి నంద్యాల అసెంబ్లీ కన్వీనర్ అభిరుచి మదు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ. పేదల ఆకలి తీర్చేందుకు మోది క్యాంటీన్ కు అభిరుచి సేవాసమితి ఆర్థిక సాయంతో అనుమతి ఇవ్వాలని జిల్లా కలెక్టర్ శ్రీనివాసులకు వినతిపత్రం అందించామని ఆయన అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో వున్న అన్నా క్యాంటీన్లో పేదల కు ఉచిత భోజనం అందించేందుకు అనుమతి ఇవ్వాలని కోరామన్నారు . ఆసుపత్రికి వెచ్చే రోగుల,బంధువులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని పేదవారు అధికంగా వస్తుండడంతో వైద్యం ఖర్చులతో పాటు భోజన ఖర్చులు కూడా అవుతున్నాయని అభిరుచి సేవా సమితి ద్వారా ఉచితంగా బోజన వసతి కల్పించాలని నిచ్చాయించుకున్నానని అన్నారు.ప్రస్తుతం ప్రభుత్వ ఆసుపత్రి



సమీపంలో అన్నా క్యాంటీన్ నిరుపయోగంగా వుండడంతో అక్కడ మోది క్యాంటీన్ కు అనుమతి ఇస్తే సొంత ఖర్చులు పెట్టుకుంటాను అని అన్నారు .ఆసుపత్రి అధికారితో మాట్లాడుతానని కలెక్టర్ చెప్పారని అన్నారు. పేద ప్రజల ఆకలి తిరిస్తే జీవితంలో అంతా కంటే ఆనందం ఏమి లేదన్నారు. డబ్బు ఎంత సంపాదించినా సేవలో వచ్చే ఆనందం మరువలేనిది అన్నారు. అధికారులు ఏర్పాటుకు అవకాశం ఇస్తే త్వరలో పేదలకు నాణ్యమైన భోజనం ఉచితంగా అందిస్తానని అన్నారు. నా సంకల్పానికి అందరూ ఆశీర్వదించండి, సేవకు అడ్డుపడవద్దని కోరారు.

## ఇంట్రా స్పోర్ట్స్ మీట్లో భాష్యం విద్యార్థుల విజయ డంకా..



విభారె న్యూస్ ఫిబ్రవరి 07 ఎమ్మిగనూరు..కర్నూల్ లోని భాష్యం స్కూల్స్ రాయలసీమ జోన్ ఇంచార్జ్ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కాలేజీలో జరిగిన భాష్యం స్కూల్స్ జోనల్ లెవెల్ ఇంట్రా స్పోర్ట్స్ మీట్లో ఎమ్మిగనూరు భాష్యం స్కూల్ విద్యార్థుల విజయ డంకా మోగించారు. స్పోర్ట్స్ మీట్లో పథకాలు సాధించిన విద్యార్థిని విద్యార్థులను రాయలసీమ జోన్ ఇంచార్జ్ అనిల్ కుమార్ బహుమతులు ప్రధానం చేసి అభినందించారు. బుదవారం పట్టణంలోని భాష్యం స్కూల్ ప్రిన్సిపాల్ మాచాని కవిత ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీని సోమప్ప సర్కిల్ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాచాని కవిత మాట్లాడుతూ కర్నూల్లో భాష్యం స్కూల్స్ జోనల్ లెవెల్ ఇంట్రా స్పోర్ట్స్ మీట్లో భాష్యం స్కూల్స్ కర్నూలు 1, కర్నూల్ 2,కర్నూల్ 3, గుంతకల్,ఆదోని, ఎమ్మిగనూరు బ్రాంచుల విద్యార్థులు పాల్గొనడం జరిగిందన్నారు. ఈ స్పోర్ట్స్ మీట్లో మా స్కూల్ విద్యార్థులు తమ సత్తా చాటి విజయదుంబికి మోగించారని అన్నారు. కోకో ఫైనల్ లో కేతన్ కుమార్, యశ్వంత్ సాయి, నవదీప్, విష్ణు చౌదరి, సాయి సాత్విక్ , నరేంద్ర, భరత్, భాను తిలక్ ,ముతహర్లు విజయం సాధించగా క్యారమ్స్ లో శ్రీలత, లాస్య, అనంతకృష్ణ, ఇర్షాదులు తమ సత్తా చాటారని తెలిపారు. అలాగే బాలికల విభాగంలో త్రో బాల్ రన్నర్స్ లో కీర్తి రెడ్డి, సాహితీ, రవీనా, హర్షిని, కీర్తన, జాహ్నవి, ఉషశ్రీ ,ఉష, తనుశ్రీలు తమ ప్రతిభను కనపరిచారన్నారు. ఈ స్పోర్ట్స్ మీట్లో అన్ని రంగాల్లోనూ ఎమ్మిగనూరు భాష్యం స్కూల్ విద్యార్థులు తమ సత్తా చాటినట్లు చెప్పారు. పథకాలు సాధించిన విద్యార్థిని విద్యార్థులకు ప్రిన్సిపాల్ షీల్డ్స్ అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక, అద్యపకేతర్ బృందం, పిఈటీలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఎంఈఓ ను సన్మానించిన ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం

ఆళ్లగడ్డ ప్రతినిధి ఫిబ్రవరి 06 విభారె న్యూస్ :- ఆళ్లగడ్డ మండల విద్యాశాఖాధికారిని శోభా వికవతి గణతంత్ర దినోత్సవం రోజున కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ పుష్కరం అందుకున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని అపుస్మ ఆళ్లగడ్డ యూనిట్ ఆధ్వర్యంలో ప్రైవేట్ పాఠశాల కరస్పాండెంట్ సోదరులు ఆళ్లగడ్డ నియోజకవర్గ వ్యవస్థాపకులు శ్రీనాథ్ రెడ్డి, ప్రెసిడెంట్ మల్లికార్జున, నంద్యాల డివిజన్ అపుస్మ అధ్యక్షులు అమిర్ భాష, కోశాధికారి సుబ్రహ్మణ్యం, శివకుమార్, తిరుపాల రెడ్డి, విక్టర్ మరియు ఆళ్లగడ్డ మండలం విద్యాధికారి 2 వైబి గంగాధర్ మరియు విజయకుమార్ అరుణోదయ హెచ్ఎం ఇమామ్ హుస్సేన్, సీఆర్పీలు గురునాథ్, కృష్ణమూర్తి, ఎం ఐ ఎస్ కోఆర్డినేటర్ జోష్న, డిటిపి ఆపరేటర్ ఎస్ఎం భాష, మెసెంజర్ గాబ్రియల్ లు ఈ సందర్భంగా శోభా వివేకతినీ శాలువా, పూలమాలతో సత్కరించారు.



ఎంఈఓ ను సన్మానిస్తున్న ప్రవేట్ పాఠశాల యాజమాన్యం

## నులి పురుగుల నిర్మూలన విజయవంతం చేయాలి

### డాక్టర్ అంకిరెడ్డి అసిస్టెంట్ కమిషనర్





విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 07- నంద్యాల పట్టణంలో 9 వ తేదీన జరిగే జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమం విజయవంతం చేయాలని అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ అంకిరెడ్డి పేర్కొన్నారు. పురపాలక సంఘం కార్యాల యంలో ప్రైవేటు స్కూల్ హెడ్ మాస్టర్లతో మరియు సచివాలయ హెల్త్ సెక్రటరీల తో సమావేశమయ్యారు. అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ అంకిరెడ్డి మాట్లాడుతూ ఈ నెల 9 వ తేదీన జరిగే జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. నులి పురుగునివారణకు అల్బండజోల్ మాత్ర పిల్లలకు సురక్షిత మైన మాత్రఅనిఆయనఅన్నారు. 1-5ఏళ్లపిల్లలకు అంగన్వాడీ కేంద్రాల లో. 6-19 ఏళ్ల పాఠశాల కళాశాల లో ఇస్తారని తెలిపారు. నమోదు అవ్వని పిల్లలకు పాఠశాలలకు వెళ్లని పిల్లలకు అంగన్వాడీ కేంద్రాల వద్ద ఇస్తారని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పిల్లలకు మాత్ర ఇచ్చి ఇంటికి పంపరాదన్నారు . పిల్లలకు నులి పురుగుల నిర్మూలన వలన ప్రయోజనాలను వివరించారు. రక్త హీనతను నివారిస్తుందని పోషకాల గ్రాహ్యతను మెరుగు పరుస్తుందన్నారు. అనంతరం నులి పురుగుల నిర్మూలన పోస్టర్ను విడుదల చేశారుఈ కార్యక్రమంలో సచివాలయ హెల్త్ సెక్రటరీలు సూర్య నారాయణమ్మ. కెజియ. సురేఖ . తదితరులు పాల్గొన్నారు,

## డిఎస్పి చేతుల మీదుగా పుస్తకావిష్కరణ....

విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి :- ఫిబ్రవరి 7 జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీ నక్కల మెట్ట శ్రీనివాసులు గారి జీవిత చరిత్రపై ముద్రించిన గ్రంథమును డోన్ డీఎస్పీ శ్రీనివాసు రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ భారత దేశంలో బీసీ విద్యార్థులు, బీసీ ప్రజల కొరకు 2008 లో పోరాటాలు చేసి దేశానికి ఆదర్శంగా ఆర్ కృష్ణయ్య తర్వాత శ్రీనివాసులు నిలిచారని జీవితమంతా బడుగు బలహీన వర్గాల రాజ్యాధికారం కొరకు హక్కుల కొరకు దేశవ్యాప్తంగా పోరాటాలు జరిపి ఎన్నో సంక్షేమ పథకాలు బీసీలకు తీసుకొని వచ్చారని ఆయన చేసిన సేవలు పోరాటాల చరిత్రను ఆయన అభిమానులు మేధావులు అందరూ కలిసి పుస్తక రూపముగా తయారు చేశారని, ఆ పుస్తకాన్ని డోన్ డిఎస్పీ చేతుల మీదుగా ఆవిష్కరించడం జరిగిందని ఈ అవకాశాన్నిచ్చిన డీఎస్పీ శ్రీనివాసులు రెడ్డి కి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సామాజిక సేవకులు సంఘసంస్కర్త మహమ్మద్ రఫీ, బీసీ సంక్షేమ సంఘం జిల్లా నాయకులు హుస్సేన్ పీరా, శ్రీ మల్లికార్జున స్వామి దూదేకుల సిద్ద వనం లక్ష్మీదేవి, చాముండేశ్వరి, వడ్డే సుజాతమ్మ, మాధవిలత, ధనుంజయ గౌడు తదితరులు పాల్గొన్నారు.



EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190